ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
మంగళవారం 19 మార్చి 2024





జగిత్యాలలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



జగిత్యాల కాషాయమయం

- ప్రధాని మోదీ పర్యటన సక్సెస్
- విజయ సంకల్ప సభతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

జగిత్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్ప సభతో జగిత్యాల జిల్లా కేంద్రం కషాయమయం అయ్యింది. ప్రధాని మోదీ తొలిసారి జగిత్యాలకు రావడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభస్థా నాలకు చెందిన ముఖ్యనేతలందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి జన సమీకరణ భారీగా చేపడంతో సభా ప్రాంగణం నిండిపోయింది. షెడ్యూల్ ప్రకారమే మోదీ పర్యటన సాగింది. ప్రధాని వేదిక పైకి రాగానే మోదీ...మోదీ అంటూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు లేచి చప్పట్లు కొట్టారు. అనం తరం సభకు వచ్చిన వారికి ఆయ న వేదిక పై నుంచి అభివాదం చేశారు. మోదీ తన ప్రసంగంలో నిజా మాబాద్, కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులు ధర్మపురి అరవింద్, బండి సంజ య్, గోమాస శ్రీని వాస్‌ను గెలిపించాలని కోరారు. వీరి గ్యారంటీకి మోదీ అండగా ఉంటా రని ప్రధాని చెప్పడంతో ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు.





భరతమాత వేషధారణలో చిన్నారి, నినాదాలు చేస్తున్న మహిళలు

● తెలుగులో ప్రసంగం ప్రారంభం

సభలో మోదీ ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంతో సభికులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. ప్రసంగంలో అధ్యంతం ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం మోదీ చేశారు. ఈ సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ప్రజలు బీజేపీ పట్టం కట్టనున్నారని అర్థమవుతోందని ప్రధాని చెప్పడంతో స్థానికుల నుంచి మం చి స్పందన వచ్చింది. మోదీ తన ప్రసంగంలో ఎక్కువగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. విజయ సంకల్ప సభ విజయవంతం కావడం బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది. మోదీ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. కేంద్రంలో బీజేపీ సర్కారు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ పీఎం మోదీ ప్రజలను ఆకర్శించే విధంగా ప్రసంగించారు. మోదీ సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంది

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



జగిత్యాల టౌన్: కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. జగిత్యాలలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో కాళేశ్వరం కుంభకోణంలో వేల కోట్లు రూపాయలు కేసీఆర్ కుటుంబ సభ్యులు దోచుకుందన్నారు. లిక్కర్ స్కాం, గొర్రెల స్కాం, దళితబంధు స్కాం ఇలా బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనం దోపిడికి గురయిందని విమర్శించారు. దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. మెజార్టీ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు. ప్రధానంగా మహిళలు, యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. దక్షిణ భారత దేశంలో రోజురోజుకు బీజేపీ బలపడుతుందన్నారు. ఇటీవల ప్రధానీ మోదీ దక్షిణ భారత దేశంలో జరుపుతున్న పర్యటనల్లో బీజేపీ బలోపేతం తేటతెల్లం అవుతుందన్నారు. ప్రధాని మోదీ నిర్వహించిన ప్రతీ బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

జగిత్యాల ఉద్యమాల గడ్డ

- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



జగిత్యాల ఉద్యమాల గడ్డ అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. జగిత్యాలలో రామన్న, గోపన్న తీవ్రవాదుల చేతిలో అమరులయ్యారని గుర్తు చేశారు. వీరులనుగన్న జగిత్యాల గడ్డలో పీఎఫ్ఐ అనే దేశద్రోహులు అడుగుపెట్టడం ఆందోళనకరంగా ఉందన్నారు. రాముడి పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గజగజ వణుకుతున్నారన్నారు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముడి గుడి కట్టింది బీజేపీయేనని స్పష్టంచేశారు. బీజేపీ బరాబర్ రాముడి పేరుతోనే ఎన్నికలకు వెళ్తుందని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. నిజాం సమాధి వద్ద మొకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టివేసి రజాకార్ల సినిమా చూపించాలన్నారు.

పర్యటన సాగిందిలా...

- ఉదయం 10.45 గంటలకు పీఎం మోదీ హెలి క్యాప్టర్ ద్వారా హైద్రాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్నారు.
- ఉదయం 10.55 నిమిషాలకు పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో ఏర్పా టు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగారు.
- 11.15 నిమిషాలకు కాన్వయ్ ద్వారా రోడ్డు మార్గంలో హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.32 నిమిషాలకు పీఎం మోదీ ప్రసంగం ప్రారంభించారు.
- 12.20 గంటలకు ప్రజలకు వీడ్కోలు చెబుతూ పీఎం మోదీ సభా వేదిక వద్ద నుంచి హెలి ప్యాడ్ వద్దకు వెనుదిరిగారు.
- 12.35 నిమిషాలకు హెలిక్యాప్టర్ ద్వారా పీఎం మోదీ హైద్రాబాద్‌కు తిరుగు ప్రయాణమ య్యారు.

మోదీ సభ సైడ్ లైట్స్

- ప్రధాని మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభిం చడంతో సభికులు చప్పట్లు, ఈలలు వేశారు.
- సుమారు గంట పాటు పీఎం మోదీ జగిత్యాల సభ వేదిక వద్ద గడిపారు.
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలు కుతూ ప్రధానీ మోదీ పిలుపు మేరకు సభికులు తమ మొబైల్స్‌లోని టార్చ్‌లైట్ ఆన్ చేసి కేరిం తలు కొట్టారు.
- విజయ సంకల్ప సభలో పీఎం మోదీ వచ్చిన తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిషన్ రెడ్డికి మినహా ఇతరులెవరికి ప్రసగించే అవ కాశం దక్కలేదు.
- ఎంపీ బండి సంజయ్ ప్రసంగిస్తున్న సమ యంలో యువకులు కేరింతలు కొట్టారు
- ప్రధాని మోదీ కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థులను నా సోద రులు అని సంబోదించారు.





మోదీని సన్మానిస్తున్న ఎంపీ బండి సంజయ్



పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మోదీ



ప్రధాని మోదీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



హాజరైన కార్యకర్తలు, జనం

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు పరీక్షకు 7,716 మంది హాజరు
- తొమ్మిది మంది గైర్హాజరు

పెద్దపల్లి కల్చరల్ మార్చి 18: జిల్లాలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి మాధవి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. చీకురాయి రోడ్‌లోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితులలో ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లవద్దని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో 45 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి తెలుగు పరీక్షలో 7,725 విద్యార్థులకు గాను 7,716 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మంథని: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మొత్తం 516 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్ష అయిన తెలుగు పేపర్ రాయాల్సి ఉండగా 512 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో 117 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 179 మంది విద్యార్థులకు గాను177 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 220 మందికి విద్యార్థులకు గాను 218 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

ధర్మారం: పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని ధర్మారం హైస్కూల్, ఆదర్శ పాఠశాల, నందిమేడారం, దొంగతుర్తి హైస్కూల్, మల్లాపూర్ బాలికల గురుకుల విద్యాలయం పరీక్ష కేంద్రాల్లో 735 మంది విద్యార్థులకు గాను 733మంది పరీక్షలకు హాజరు కాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాలను ఎస్సై సత్యనారాయణ పర్యవేక్షించారు.





రామగుండంలో విద్యార్థినిని తనిఖీ చేస్తున్న పరీక్షా కేంద్రం అధికారులు, పెద్దపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ సోమవారం తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతు పరీక్షాకేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

● పదో తరగతి పరీక్షలకు సుల్తానాబాద్ మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 824 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు ఒక్కరు గైర్హాజర్ ఆయ్యారని ఎంఈవో సురేందర్ తెలిపారు. గర్రెపల్లి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల, తెలంగాణ మోడల్ స్కూల్, సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, సెయింట్ మేరీ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

కోల్‌సిటీటౌన్: ఉమ్మడి రామగుండం మండలంలో పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. అంతర్గాం, పాలకుర్తి మండలాలతో పాటు రామగుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని ప్రాంతాల్లో మొత్తం 15 పరీక్షా కేంద్రాల్లో 2,800 మందికి పైగా విద్యార్థు లు పరీక్షలు రాశారు. ఉదయం 9గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని జరిగిన పరీక్షలో 88మంది విద్యార్థులకు గాను 87మంది పరీక్షలకు హాజరుకాగా ఒక్కరు గైర్హాజరయ్యారని ఎంఈవో కేవిత తెలిపారు.

రామగిరి: మండలంలోని వాణి పాఠశాలలో 180 మంది విద్యార్థులకు 180 మంది, నాగేపల్లి ఉన్నత పాఠశాలలో 140 విద్యార్థులు 140 మంది విద్యార్థులు హజరైయ్యారు. రామగిరి ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట ఏర్పాట్లాను చేపట్టారు.

జూలపల్లి: మండల వ్యాప్తంగా 262 మంది పదోతరగతి విద్యార్థులకు మండల కేంద్రంలో పరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ కవిత తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కాల్వ శ్రీరాంపూర్‌లో 200 మంది విద్యార్థులు, కునారంలో 35 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈవో రాజన్న తెలిపారు.










సుల్తానాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, కాల్వశ్రీరాంపూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది, పెద్దపల్లిలో హాల్‌టికెట్ నంబర్ సరిచూసుకుంటున్న విద్యార్థినులు, ధర్మారంలో పరీక్ష తీరును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

వేసవి దృష్ట్యా పని వేళలు మార్చాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18: పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్టు కార్మికుల పనివేళలను మార్చాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సివిల్ డీజీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ ఉపాధ్యక్షుడు బి అశోక్ మాట్లాడారు. వేసవి కారణంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, కాంట్రాక్టు కార్మికుల పని వేళలలో మార్పులు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బండ పద్మ, రాజనర్సు, ప్రేంకుమార్, మల్లేష్, శారద, రమ, స్వరూప ఉన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	6:25 మంగళవారం
సహర్	4:53 బుధవారం



చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 18: సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లోని ఓ మెడికల్ షాప్ వద్ద 48ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పడిపోవడంతో స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు టౌన్ సీఐ రఘుపతి సోమవారం తెలిపారు. ఇతని వివరాలు ఎవరైనా తెలిసినచో సమాచారం అందివ్వాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామని పేర్కొన్నారు. గతంలోనూ రెండు సార్లు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందాడని, ఇతని వివరాలు తెలిస్తే ఫోన్ నెం. 8712656366కు సమాచారం అందివ్వాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి 18: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెవెన్ డే రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ అండ్ యంగ్ ఫాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ ఇన్ తెలంగాణ రీజియన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ పరిశోధక విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పరిశోధనలో అవలంబించే స్టాటిస్టికల్ మెళకువలు, పరిశోధన ఆవశ్యకత తదితర అంశాలు ఈ కోర్సు ద్వారా నేర్చుకోవచ్చన్నారు. ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి హానరరీ డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్, సదరన్ రీజియన్ మాట్లాడుతూ పరిశోధన అంశాల పట్ల నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలకు ఐసిఎస్ఎస్ఆర్, ఆర్థికపరమైన సహాయం చేయటానికి ముందుకు వస్తుందన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీపైన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పీహెచ్‌డీ విద్యార్థులతో పాటు అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్ మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు ఎప్పుడు కొత్త అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ ఈ పరిశోధన కోర్సును విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు ఆచార్య సుధాకర్‌రెడ్డి 'ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఏనాబ్లెడ్ రీసెర్చ్ ఇన్ సోషల్ సైన్సెస్' అనే అంశం పైన తన సెషన్‌ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ ఎం మనోజ్‌కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ తిరుపతి, బి.నరేష్ డాక్టర్ పరశురాములు, పరిశోధక విద్యార్థులు అజీజ్, విజయానంద్, వివిధ విశ్వ విద్యాలయాల నుంచి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌యూ ఉపకులపతి మల్లేష్

హుజూరాబాద్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

● రూ. 8.64లక్షలు దోచుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

హుజూరాబాద్, మార్చి 18: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలో చొరబడి భారీ ఎత్తున డబ్బు దోచుకెళ్లిన సంఘటన హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం బ్యాంకు సిబ్బంది సుమారు రూ.25లక్షలు పెట్టి వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలోకి చొరబడి ఏటీఎం మిషన్‌ను కట్టర్‌తో కట్‌చేసి అందులో ఉన్న రూ.8.64లక్షలు దోచుకెళ్లారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఏటీఎం మిషన్‌ను పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఏటీఎంను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు టౌన్ సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ విఫలం

● కాళేశ్వరం అవినీతికి ఆస్కారం ఇచ్చింది మోదీనే ● తెలంగాణ ఫలితాలే దేశంలో పునరావృతం ● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఎంపీ సీట్లు సున్నాకే పరిమితమవుతాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంధిరాభవన్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి అమ్మకానికి పెట్టేలా చేసిన వ్యక్తి మోదీ అని అన్నారు. జగిత్యాలలో నిర్వహించిన సభలో మోదీ చేసిన ప్రసంగంలో దేశ భవిష్యత్ ప్రణాళిక వివరించాల్సి ఉండగా నిస్తేజంగా ఉందని, నిర్మాణాత్మకంగా ఉంటుందని భావిస్తే స్పష్టత లోపించిందన్నారు. ప్రధాని హోదాలో ఉన్న మోదీ బాధ్యతారహితంగా మాట్లాడారన్నారు. దశాబ్ద కాలంగా మోదీ దేశాన్ని పరిపాలించినప్పటికీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని రైతులు ఉద్యమిస్తే ప్రధాని వెనుకడుగు వేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పంటలకు గిట్టుబాట ధర కల్పనకు కృషిచేశామని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఎంత వరకు నెరవేర్చారో కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలన్నారు. నిజామాబాద్‌లో గతంలో కంటే ఇప్పుడు పసుపు పంట సాగు 30 వేల ఎకరాలకు తగ్గిందని ఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీ గురించి మోదీ మాట్లాడడం ఆచ్చర్యం కలిగిస్తుందని అన్నారు. నిన్నటి వరకు బీఆర్ఎస్, బీజేపీ అలయ్, బలయ్‌గా ఉండి ఇప్పుడు ఎన్నికలకు ముందు డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, జాతీయ హోదాగా గుర్తించకపోవడంతోనే అవినీతికి ఆస్కారం బీజేపీనే కల్పించిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ న్యాయ విచారణకు కమిటీ వేసిందన్నారు. తెలంగాణ పట్ల మోదీ వివక్ష చూపడంతోనే అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న కవితను ఇంతకాలం ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు తెలుసునని కేవలం ఎంపీ ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే అరెస్టుకు తెరలేపారన్నారు. రాష్ట్ర ఎన్నికల ఫలితాలే దేశంలో కూడా పునరావృతం అవుతాయని బీజేపీ నిజరూపం ప్రజలు గమనిస్తునారన్నారు. ఈ సమావేశంలో పీ సీసీ సభ్యుడు మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ఉన్నారు.

వివాహ ఊరేగింపులో విషాదం

● డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ఓదెల, మార్చి 18: మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి ఒక వివాహ ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ కుమార్(30) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. అతని మిత్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. విజయకుమార్ మిత్ర బృందం కొలనూర్‌కు చెందిన ఓ వ్యక్తి వివాహానికి వెళ్లారు. అనంతరం ఊరేగింపు నిర్వహిస్తున్న క్రమంలో విజయ్‌కుమార్ డ్యాన్స్ చేస్తూ, అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలాడు. దీంతో స్థానికులు, మిత్రులు ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్ష అనంతరం అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రావుల పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

ధర్మారం, మార్చి 18: మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన భూత గడ్డల నర్సింగం(35) అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీట మునిగి మృతి చెందాడు. కొత్తూర్ గ్రామ శివారులో సాగల నారాయణ పొలం వద్ద ఉన్న వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు నర్సింగం దిగాడు. బావిలో తూరు తీగ అతని చేతులకు చుట్టుకుని అదే బావిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

జనశక్తి పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 18: జనశక్తి నక్సలైట్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన పాకాల సాయి అనే వ్యక్తిని సోమవారం కోనరావుపేట పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన సాయి అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత విప్లవ సంస్థ అయిన జనశక్తి అరుణోదయ సంస్థలో పనిచేస్తున్నట్లు చెప్పి అమాయక ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో డబ్బులు వసూళ్లకు పాల్పడే వారి సమాచారం అందివ్వాలని, ఎవరైనా ఫోన్‌కాల్‌చేసి బెదిరిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

కరీంనగర్‌క్రైం, మార్చి 18: కిసాన్‌నగర్‌లోని బేతెస్తచర్చి సెక్రటరీ కవ్వంపల్లి తిమోతిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్-3 టౌన్ సిఐ తెలిపారు. మానకొండూర్ శాసన సభ్యుడు సత్యనారాయణను చర్చిలోని పిలిచి సన్మానించినందుకు ఎన్నికల కోడ్‌ఉల్లంఘన కింద మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి నివేదిక ప్రకారం కరీంనగర్-3 టౌన్‌లో తిమోతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపితే జైలు

కరీంనగర్ క్రైం, మార్చి 18: మద్యం సేవించి వాహనం నడిపిన వారికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ కరీంఉల్లా తెలిపారు. నగరలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 19 మందిని కరీంనగనర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, 16 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. మిగతా 12 మందికి 18,000 రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలో ప్రతి రోజు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లు ఉంటాయన్నారు. ఈ సంవత్సరంలో 61 మందికి మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు జైలు శిక్ష పడిందన్నారు.

22లోగా బీహెచ్ఎంసీటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, మార్చి 18: ఎస్‌యూ పరిధిలోని బీహెచ్ఎమ్‌సీటీ(బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్ క్యాటరింగ్ టెక్నాలజీ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష రుసుం చెల్లించడానికి ఈ నెల 22వరకు గడువు ఉందని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 27వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



లక్ష్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 18: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ బైక్ ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని గంగారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని మొట్లపల్లికి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(64) తన కొడుకు తిరుపతితో కలిసి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ మండలం పెరుకపల్లిలో ఆదివారం ఒక శుభకార్యానికి హాజరయ్యారు. రాత్రి మొట్లపల్లికి తిరిగి వస్తుండగా గంగారం శివారులో ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న దొమ్మటి లక్ష్మయ్య చేతి కర్రకు ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం తాకడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి తండ్రీకొడుకులు కిందపడ్డారు. తిరుపతికి స్వల్ప గాయాలు కాగా లక్ష్మయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. టాటాఏస్ వాహనదారుడు తీవ్ర గాయాలైన లక్ష్మయ్యను వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి విస్మిత తేజ్

జ్యోతినగర్, మార్చి 18: సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి విస్మిత తేజ్ సూచించారు. విస్మిత తేజ్ ఎన్టీపీసీలో సోమవారం పర్యటించారు. ఉదయం రామగుండం ఎన్టీపీసీకి చేరుకున్న విస్మితకు ఈడీ కేదార్‌రంజన్ పాండు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) కంట్రోల్ రూంను పరిశీలించారు. ప్రాజెక్టుకు చెందిన ఆపరేషన్ అధికారులతో, యువ ఎగ్జిక్యూటివ్ ట్రైనీతో సమావేశమై విద్యుత్ కేంద్రం పనితీరుపై చర్చించారు. టీఎస్‌టీపీలోని ఇతర విభాగాలను ఏరియల్ వ్యూలో అదనపు కార్యదర్శి విస్మిత పరిశీలించారు. తరువాత 2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో పర్యటించారు. ఈ సందర్భంగా బొగ్గు సరఫరా, అన్‌లోడింగ్‌కు సంబంధించి ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును అదనపు కార్యదర్శి విస్మిత తేజ్ సందర్శించారు. దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు నిర్వహణ, పనితీరుపై ఆమె సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం



టీఎస్‌టిపిపిలో పర్యటిస్తున్న అదనపు కార్యదర్శి విస్మిత తేజ్

ఎన్టీపీసీ, సింగరేణి సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బొగ్గు సరఫరా, అన్‌లోడింగ్, కోల్ స్టాక్ విషయంలో సమస్యలు రాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్, ఎన్టీపీసీ ఈడీ(ఎఫ్ఎం) ప్రదిప్తా కుమార్ మిశ్రా, రామగుండం ఈడీ కేదార్ రంజన్ పాండు పాల్గొన్నారు.

వివాహిత హత్య

● గొంతు నులుమి ఘాతుకం
● పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

మల్యాల, మార్చి18: మండలంలోని మ్యాడంపల్లి శివారులో ఓ వివాహిత తన మొదటి భర్త చేతిలో హత్యకు గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాలకు చెందిన కరుపి అంజలి(22)కి గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులు సాఫీగానే సాగిన వీరి సంసారంలో గొడవలు మొదలయ్యాయి. గొడవలు కాస్త ముదిరి ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం విడిపోయారు. అనంతరం అంజలికి సిద్దిపేటకు చెందిన మరో యువకుడితో కుటుంబ సభ్యులు వివాహం జరిపించారు. ఈ క్రమంలో అంజలి ఆదివారం మొదటి భర్త నరేష్ ఇంటికి వచ్చి కలుసుకుంది. అదే రోజు ఇద్దరి మధ్య ఏం జరిగిందో ఏమో గానీ మరునాడు సోమవారం ఉదయం అంజలి మృతదేహాన్ని మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో కొందరు గుర్తించారు. నరేష్ మద్యం మత్తులో అంజలితో గొడవ పడి ఆదివారం గొంతు నులిమి హత్యకు పాల్పడినట్లు ఘటనా స్థలాన్ని బట్టి స్థానికులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమ వారం గొడవ పడ్డ ప్రదేశానికి వెళ్లిన నరేష్ మృతదేహాన్ని చూసి అనంతరం నేరుగా గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. అక్కడి పోలీసులు మల్యాల పోలీసులకు సమాచారం అందించడంతో నరేష్‌ను మల్యాల స్టేషన్‌కు తరలించారు అనంతరం మల్యాల సీఐ రవి, ఎస్సై అబ్దుల్‌రహీం సంఘ టన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



అంజలి (ఫైల్)

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్ టౌన్, మార్చి 18: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జి.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నందున అధ్యాపకులు సకాలంలో హాజరుకావాలన్నారు.

26 నుంచి బీ ఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, మార్చి18: ఎస్‌యూ పరిధిలో బీ ఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 18: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 31మంది రైతులు 382క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. గత శుక్రవారం క్వింటాల్ రూ.7800 పలికిన పత్తి ధర తాజాగా రూ.200 దిగింది.

సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు అందించాలి



సుద్దాలను సన్మానిస్తున్న భారతి సాహిత్య సమితి సభ్యులు

కోరుట్ల, మార్చి 18: మన సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు అందించాలని సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. పట్టణంలోని సినారె కళాభవనంలో భారతి సాహిత్య సమితి స్వర్ణోత్సవ ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహిత్య సమితి వ్యవస్థాపకుడు స్వర్గీయ డాక్టర్ అందే వెంకటరాజం రచించిన "నిండగిరి నరసింహ శతకం"ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌తేజ మాట్లాడారు. కళలకు నిలయాలుగా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు నిలుస్తాయని అన్నారు. సామాజిక చైతన్యంలో సాహిత్యం పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా సాహిత్యంలో తనకు కోరుట్ల ప్రాంతం తల్లి లాంటిదని, తనకు మార్గదర్శనం చేసిన ఈ గురువులను ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. సమితి సభ్యులు డాక్టర్ అశోక్ తేజ, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య సమిత సభ్యులు కంచర్ల రామాచార్య, బట్లు హరికృష్ణ, అందే రాజేంద్ర ప్రసాద్, రాజోజు భూమేశ్వర్, బ్రహ్మణగారి శంకర్ శర్మ, అందే శివప్రసాద్, ఆడెపు శేఖర్, కల్కకోట చంద్రప్రకాష్, రాస భూమయ్య, తత్వాది మాదివి-రాజేంద్ర ప్రసాద్, గోనే శ్రీహరి, వనపర్తి చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మపురి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 18: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక నంది విగ్రహం నుంచి దేవాలయం వరకు గల ప్రధాన రహదారి వరు చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఆయన మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రంలోని దేవాలయంలో జరిగే స్వామి వారి కళ్యాణం, బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో జరిగే తెప్ప, డోలోత్సవాలు, ఉత్సవాల కోసం హాజరయ్యే భక్తుల వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. భక్తుల కోసం అందించే తాగు నీరు, గోదావరి నది వద్ద భక్తుల స్నానాలు సంబంధించిన వసతుల ఏర్పాట్లను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో 13 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాకు హాజరయ్యే భక్తులు గోదావరి నది స్నానం చేసుకుని స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం చేసే వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక వసతుల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన నూతన కమిటీ సభ్యులు కూడ సమన్వయంతో పని చేసి అన్ని వేళలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. అనంతరం నూతన ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్,



ఉత్సవ కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మాదాసు మల్లేష్, కొమురెల్లి పవన్‌కుమార్, నేదునూర్ శ్రీధర్‌ను ఆయన శాలువా కప్పి సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

-ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద కటుకం స్టూడియోస్ వారిచే నిర్మించబడిన ఓ అంబేడ్కరుడా మీకు పోటీ ఎవ్వరూ అనే సాంగ్ పోస్టర్, సాంగ్ ప్రోమోను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ భీమనాతి శారద, లైరిక్ కటుకం నరేందర్, సింగర్‌లు శాంతాకుమారి, గంగాధర్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పెండ్రు రమ

- వైస్‌చైర్మన్‌గా బానయ్య ఎంపిక



చైర్‌పర్సన్‌పెండ్రు రమ, వైస్ చైర్మన్ బానయ్య

మంథని, మార్చి 18: మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా శ్రీపతి బానయ్య సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన పుట్ట శైలజ, వైస్ చైర్మన్‌గా కొనసాగిన ఆరెపల్లి కుమార్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించడంతో పదవులను కోల్పోయిన విషయం విధితమే. ఆనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్ధసారథి ఆదేశాల మేరకు కలెక్టర్ నూతన చైర్‌పర్సన్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వాహణకు ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో హనుమానాయక్‌ను నియమించారు. ఆర్డీవో హనుమానాయక్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా 13వ వార్డు కౌన్సిలర్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డిని 1వ వార్డు కౌన్సిలర్ గుండా విజయలక్ష్మి ప్రతిపాదించగా, 12వ వార్డు కౌన్సిలర్ వేముల లక్ష్మి బలపర్చగా మెజారీ సభ్యులు మద్దతు ఇవ్వడంతో పెండ్రి రమ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆనంతరం వైస్‌చైర్మన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి బానయ్యను 12వ వార్డు కౌన్సిలర్ చొప్పకట్ల హన్మంతరావు ప్రతిపాదించగా 11వ వార్డు కౌన్సిలర్ వీకే. రవి బలపర్చగా వైస్‌చైర్మన్‌గా శ్రీపతి బానయ్య ఎన్నికయ్యారు. ఆనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ఆర్డీవో హనుమానాయక్ ప్రమాణస్వీకారం చేయించారు. చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ బానయ్యకు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా ఉన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఇంట్లో మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు చిత్రపటానికి చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి దంపతులను కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి, కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి, కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర, కొట్టే పద్మ, చొప్పకట్ల హన్మంతరావు, వీకే రవి, వేముల లక్ష్మి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు మొండిచేయి

- రాష్ట్రంలో ఒకేసారి 37 కార్పొరేషన్ చైర్మన్ల భర్తీ
- జిల్లాకు దక్కని ప్రాతినిధ్యం
- అసంతృప్తితో రగులుతున్న సీనియర్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల్లో ఏ ఒక్కరికి కూడా పదవులు దక్కక పోవడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అసంతృప్తితో రగిలి పోతున్నారు. కష్టకాలంలోనూ పార్టీ వెన్నంటే ఉండి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన నాయకులు ఆశించిన నామినేటెడ్ పదవులు దక్కక పోవడంతో పలువురు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రంలోని 37 కార్పొరేషన్లకు ఒకేసారి చైర్మన్లను నియమించిన విషయం తెలిసిందే. అందులో జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వకపోగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాత్రం కరీంనగర్ జిల్లాలో ఇద్దరికి పదవులు వరించాయి. గత ప్రభుత్వ హయాంలో మంత్రి, ప్రభుత్వ విప్ పదవులు మినహా కార్పొరేషన్ పదవులు చాలా మందిని వరించాయి. ఐడీసీ చైర్మన్‌గా ఈద శంకర్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణ, బుద్ధవనం ట్రస్టు చైర్మన్‌గా మల్లెపల్లి లక్ష్మయ్య, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా గంటా చక్రపాణి, ఆర్టీసీ చైర్మన్‌గా సోమారపు సత్యనారాయణ, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా కోలేటి దామోదర్, ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా పిట్టల రవీందర్, టీఎస్‌టీఎస్ చైర్మన్‌గా డాక్టర్ చిరుమల్ల రాకేష్, ఐసీడీఎస్ రెండు జిల్లాల సమన్వయకర్తగా విజయారెడ్డికి పదవులు వరించాయి.

మూడు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. వారి గెలుపులో పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కీలకపాత్ర పోషించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పలువురు నాయకులు ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. పార్టీ సీనియర్ అయిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మంత్రి పదవి వరించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేస్తున్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉంటూ వస్తున్న రామగుండం నియోజకవర్గానికి చెందిన ఏఐసీసీ సభ్యుడు హర్కార వేణుగోపాల్‌రావుకు ప్రభుత్వ సలహాదారు పదవి దక్కింది. గత ఎన్నికల్లో ఆయన రామగుండం నుంచి పార్టీ టికెట్ ఆశించారు. ప్రస్తుతం ప్రకటించిన 37 కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో జిల్లా నుంచి ఒక్కరికి కూడా వరించలేదు. ఏఐటీయూసీ కోటాలో రామగుండం టికెట్ ఆశించిన మంచిర్యాల జిల్లాకు చెందిన జనక్ ప్రసాద్ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా నియమితులయ్యారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోటాలో మంథని నియోజకవర్గ పరిధిలోని మల్హర్ మండలం వల్లంకుంటకు చెందిన మాజీ ఎంపీపీ భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డికి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ పదవి దక్కింది. జిల్లా నుంచి మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గం నుంచి శశిభూషణ్ కాచె, గంట వెంకటరమణారెడ్డి, ఇనుముల సతీష్, ఒడ్నాల శ్రీనివాస్, తొట్ల తిరుపతియాదవ్, ఉప్పట్ల శ్రీనివాస్, చొప్పరి సదానందం, పెద్దపల్లి నియోజకవర్గం నుంచి గోపగాని సారయ్య, సయ్యద్ మస్రత్, అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, గీట్ల రాజేందర్‌రెడ్డి, గుండేటి అయిలయ్య యాదవ్, భూషణవేని రమేష్‌గౌడ్, ఎలువాక రాజయ్య, తాదూరి శ్రీమాన్, బూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, రేగుంట అశోక్, దన్నాయక్ దామోదర్‌రావు, కొలిపాక శ్రీనివాస్ తదితరులు నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు.

రామగుండం నియోజకవర్గం నుంచి ఐఎన్‌టీయూసీ నాయకులు గుమ్మడి కుమారస్వామి, బాబర్ సలీం పాషా, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, సూర సమ్మయ్య, తదితరులు పదవులను ఆశించారు. అయితే వీరిలో ఎవరికి పదవులు దక్కలేదు. ప్రధానంగా చూస్తే మంథని నియోజకవర్గం నుంచి మంత్రితో పాటు ఒక కార్పొరేషన్ పదవి ఉండగా, రామగుండం నుంచి ప్రభుత్వ సలహాదారు, డీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఉన్నారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి మరెవ్వరికి నామినేటెడ్ పదవులు ఇప్పటి వరకు దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతనైనా నామినేటెడ్ పదవుల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీకి చెందిన పలువురు నాయకులు అధిష్టానాన్ని కోరుతున్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మూడు రైతు వేదికల్లో ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు జరగనున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరిలో ప్రస్తుతం పాటించవలసిన మెళకువలపై డాక్టర్ బి.శ్రీనివాస్ జగిత్యాల నుంచి రైతులకు సూచనలు అందిస్తారన్నారు. అనంతరం ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువల గురించి డాక్టర్ రాజశేఖర్ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి రైతులకు సలహాలు ఇస్తారని తెలిపారు. డాక్టర్ కే కవిత వేసవిలో సాగు చేసే కూరగాయలు వాటిపై వాడే పురుగు మందు అవశేషాల గురించి రైతులకు వివరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి గోపి పాల్గొంటారని, రైతులంతా రైతు వేదికల నుంచి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

కోల్‌సిటీ, మార్చి 18: రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై సోమవారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే సైబర్‌క్రైమ్.గౌట్.ఇన్ పోర్టల్ నందు నమోదు చేయాలని లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, క్రెడిట్ కార్డ్ రిలేటెడ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ఫేక్ కొరియర్ ఫ్రాడ్స్, లోన్ యాప్‌లు, ఓటీపీ, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్‌పై, సైబర్ వెబ్‌సైట్, 1930 టోల్‌ఫ్రీ నంబర్ ఆవశ్యకతపై వివరించారు. సమాజంలో సెల్‌ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అనర్థాలు కూడా జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ వినియోగం పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, కానిస్టేబుళ్లు కుమార్,శ్రీనివాస్, నిమ్మతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 18 : మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు నిర్వహించే ఆర్‌జేసీ, సెట్, బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఆర్‌డీసీ సెట్‌కు ఏప్రిల్12లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల ఉమ్మడి కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం.గౌతంకుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బాలుర గురుకుల జూనియర్ కళాశాలలు, 13 బాలికల జూనియర్ కళాశాలలు ఉన్నా యన్నారు. వివరాలకు www.mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఆసక్తి అర్హత గల విద్యార్థులు రెండు వందల రూపాయలు దరఖాస్తు రుసుము చెల్లించి ఏప్రిల్ 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న నిర్వహించ బడుతుందని ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం.గౌతం కుమార్ రెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

మైనారిటీ గురుకులాల్లో దరఖాస్తుకు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, మార్చి18: మైనారిటీ గురుకులాల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాల కోసం మార్చి 31 వరకు గడువు పొడిగించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25విద్యా సంవత్సరానికిగాను తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల/కళాశాలలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు, అలాగే 6,7,8 తరగతులలో మిగిలిన సీట్లకు www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి, పాఠశాలల లేదా కళాశాలల ప్రిన్సిపాళ్లను పెద్దపల్లి గర్ల్స్ స్కూల్ 7331170848, పెద్దపల్లి బాలికల కళాశాల 9603313883, రామగుండం బాలుర స్కూల్ 7331170845 రామగుండం బాలుర కాలేజీ 9948978628 మంథని గర్ల్స్ స్కూల్ 7995057944, మంథని గర్ల్స్ కాలేజీ 8096286629 నందు సంప్రదించాలని మొహమ్మద్ మేరాజ్ మహ్మద్ ఆ ప్రకటనలో తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఆధారాలు లేకుండా రూ. 50 వేల నగదుకు మించి ప్రయాణించవద్దు - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించకుండా అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు వ్యవహరించాలని పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు కేంద్రఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, అప్పటి నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18 నోటిఫికేషన్ విడుదల కానున్నదని ఆదేరోజు నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న పరిశీలిస్తామని, 29 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని అన్నారు. మే 13న పోలింగ్ జరగనున్నదని, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయని, మొత్తం 15,92,996 మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు 1,850 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటరు జాబితాలో ఓటు లేని వాళ్లు ఓటు హక్కు కోసం నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థులు కుల,మతాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయవద్దన్నారు. సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని, వీటిని ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ప్రచారం నిర్వహించరాదన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాలని, ఆ తర్వాత మైకులను బంద్ చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు పార్లమెంట్ పరిధిలో 20 సర్వేలెన్స్ బృందాలు, 21 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 14 వీడియోబృందాలను, ఎనిమిది వీడియో వ్యూయింగ్ బృందాలను నియమించామన్నారు. కోడ్ ఉల్లంఘనలపై టోల్‌ఫ్రీ 1950 నంబర్‌కు గానీ, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరించేందుకు 24 గంటల పాటు కాల్ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఎలాంటి ఆధారాలు లేకుండా 50 వేల రూపాయలకు మించి నగదుతో ప్రయాణించవద్దని సూచించారు. తనిఖీల్లో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామన్నారు. ఆధారాలు సమర్పించినట్లయితే కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్ లాల్, జె అరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం



సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

కోల్‌సిటీటౌన్, మార్చి 18: పోషణపక్షంలో భాగంగా గోదావరిఖని జవహర్‌నగర్ (విఠల్‌నగర్) అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, అన్నప్రాసన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్ శిరీన్ హాజరై గర్భిణులకు, బాలింతలకు పోషక ఆహారాల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె భాగ్యలక్ష్మి, హెల్పర్ రజిత పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ధర్మారం, మార్చి 18: ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై పద్మశాలి సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఒడ్నాల శంకరయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సోమవారం సన్మానించారు. సోమవారం పద్మశాలి కుల సంఘం నాయకులు ధర్మపురిలో విప్ లక్ష్మణ్‌కుమార్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్

కళ్యాణ్‌నగర్, మార్చి 18: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా కృషి చేయాలని స్వశక్తి సంఘాలకు 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కళ్యాణ్‌నగర్‌లోని మేరు భవన్‌లో జరిగిన స్వశక్తి సంఘాల మహిళ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతీఒక్కరికి అందేలా ఇంటింటికి వెళ్లి చేరవేయాలన్నారు. కొంత మంది అర్హులైనప్పటికీ వారు పథకాలు పొందలేక పోతున్నారని, స్వశక్తి మహిళా సంఘాలు స్వయంగా ఇంటింటికి వెళ్లి పథకాలు అందేవిధంగా చూడాలన్నారు. అనంతరం తిరుమల వాడ సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా హేమలతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ ధరణి స్వరూప, ఆర్‌పీ శ్రీకళ, రూప, సభ్యులు కల్పన, రమ్య, మీనాక్షి, రాజేశ్వరి, స్వప్న, జ్యోతి, సౌజన్య, అంజలి, మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలి

గోదావరిఖని, మార్చి 18: పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసేందుకు గడ్డం వంశీకృష్ణకే టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ నాయకుడు పి మల్లికార్జున్ ఒక ప్రకటనలో అధిష్టానాన్ని కోరారు. సుదీర్ఘ కాలంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం దివంగత నేత కాకా వెంకటస్వామి, ఆయన కుమారుడు వివేక్ ఎంతో కృషి చేశారన్నారు. వారి వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వంశీకృష్ణకే కాంగ్రెస్ టికెట్ ఇస్తే గెలుపు సునాయాసమవుతుందని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో బొగ్గు గనుల్లో పనిచేసిన సింగరేణి కార్మికులకు పెన్షన్ విధానాన్ని కాకా వెంకటస్వామి కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో తీసుకువచ్చారన్నారు. వివేక్ ఎంపీగా ఉన్న సమయంలో మూసివేసిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఒప్పించి రూ.10వేల కోట్ల అప్పును మాఫీ చేయించి బీఐఎఫ్ఆర్ నుంచి బయటపడేశారని తెలిపారు. దీనివల్లనే నేడు తిరిగి గ్యాస్ ఆధారంగా రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్‌సీఎల్) ప్రారంభమైందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ యువనాయకుడు గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని ఆయన పార్టీ అధిష్టానాన్ని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

కళ్యాణ్‌నగర్, మార్చి 18: రామగుండం కార్పొరేషన్ ఆరో డివిజన్‌కు చెందిన పలు పార్టీలకు చెందిన 50మంది సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆరో డివిజన్ ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సమక్షంలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయని, కార్యకర్తలు క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ముల్కాళ్ల గోవర్ధనశాస్త్రి, వంగ వీరస్వామి, రాజేశ్వర్‌రావు, రాజేందర్, విశాల్, శంకరయ్య ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

పంచాయతీ కార్యదర్శుల నిరసన



కాల్వశ్రీరాంపూర్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

ఓదెల, మార్చి 18: మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జిలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎంపీవోను అక్కడి ఎంపీపీ దాడిచేయడాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ తప్పులు వారివైతే ఎంపీవోపై దాడిచేయడం యావత్ ప్రభుత్వ ఉద్యోగులకు జరిగిన అవమానం అని అన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎంపీపీ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, పంచాయితి కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండల ఎంపీవో శ్రవణ్ కుమార్‌పై అక్కడి ఎంపీపీ అకారణంగా చేసిన దాడిని ఖండిస్తున్నామని గ్రామ కార్యదర్శులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కోడేరు ఎంపీపీ క్షమాపణ చెప్పకుంటే తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ నూనేటి సంపత్, ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో గోవర్ధన్, టీపీఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు కంకణాల రాజేష్ నల్ల బ్యాడ్జీలు ధరించి మద్దతు తెలిపారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18: ఈనెల 19వతేదీ నుంచి కాలనీలోని వెంకటేశ్వర స్వామి 38వ ఆలయ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 19న అభిషేకం, 20న సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం, 21న వసంతోత్సవం, 22న గరుడసేవ, డోలోత్సవం, 23న రథోత్సవం, సహస్రదీపాలంకరణ, 24 తేదీన పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించనున్నట్లు జగన్నాథాచార్యులు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రామగిరి, మార్చి 18: మండలంలోని బేగంపేట్ గ్రామశివారులో ఆదివారం రాత్రి రామగిరిఖిల్లా ప్రాంతంలో పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు రామగిరి ఎస్ఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 93,950 నగదును స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రవీందర్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వీర్లపల్లెలో మంగళవారం నిర్వహించనున్న ఉచితవైద్య శిబిరాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోదావరిఖని టూటౌన్ సీఐ బి రవీందర్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. వీర్లపల్లెలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అతిథులుగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు సీఐ పేర్కొన్నారు. కళ్లు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి వినికిలోపం ఉన్న వారికి వినికిడి పరికరం, దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు ఉచితంగా అందజేయనున్నట్లు సీఐ రవీందర్ పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీరు

ఉప్పరిపల్లికి రాకపోకలకు అంతరాయం



ఉప్పరిపల్లిలోని రైల్వే అండర్‌బ్రిడ్జిలో నిలిచిన నీరు

ఓదెల, మార్చి 18 : మండలంలోని ఉప్పరిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచిపోవడంతో రెండు రోజులుగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల విడుదల చేసిన కాలువ నీటితో ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోయింది. దీని వల్ల గ్రామస్థులకు దారిలేకుండా పోయింది. గత ఫిబ్రవరి 26న, రైల్వే గేటు, అండర్ బ్రిడ్జిని ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక రాకపోకలకు ఎలాంటి ఆటంకం ఉండదనుకున్న గ్రామస్థులు, ముఖ్యంగా రైతులకు దారి లేకుండా పోవడంతో నిరాశ మిగిలింది. బ్రిడ్జి కిందికి నీరు రాకుండా రెండువైపులా అడ్డుగోడలు నిర్మించాల్సి ఉంది. కానీ సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోక పోవడంతో ఈ గోడలు ఇప్పటికి నిర్మాణం కాలేదు. దీంతో కాలువ నీరు నిల్వ ఉండడంతో రైతులు తమ పంటలకు చూసుకోకుండా అధికారుల వెంట పరిష్కారం కోసం తిరుగుతున్నారు. రైతులు పంటల వైపు రాకపోవడం వల్ల ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరిపంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

● రైల్వే అధికారులు స్పందించాలి

- ఏనుగుల సదయ్య, మాజీ ఉపసర్పంచ్, ఉప్పరపల్లి



ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీటిని తొలగించేం దుకు రైల్వే అధికారులు స్పందించాలి. లేకుంటే గ్రామస్థులమంతా రైల్వే కార్యాలయాల ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధమవుతాము. నీరు నిలిచిపోవడంతో గ్రామస్థులు ఎటు పోకుండా, రాకుండా ఉంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై తగు చర్య తీసుకుని రాకపోకలకు మార్గం చూపాలి.

కమాన్‌పూర్ ఎంపీడీవోగా కొప్పుల శ్రీనివాస్



కమాన్‌పూర్, మార్చి 18: కమాన్‌పూర్ ఎంపీడీవోగా కొప్పుల శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం మంథని ఎంపీడీవో ఉన్న కొప్పుల శ్రీనివాస్‌ను కమాన్‌పూర్ ఎంపీడీవో బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శ్రీనివాస్ సిరిసిల్ల జిల్లా కోనరావు పేట, జగిత్యాల, కోరుట్ల, వీణవంక, పెద్దపల్లి, మంథనిలలో పనిచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాల్‌రాజ్‌పల్లికి ఆర్టీసీ బస్సు ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి, మార్చి 18: జూలపల్లి మండలంలోని బాల్‌రాజ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, మాజీ విండో చైర్మన్ గందు సంజీవ్‌లు కలిసి ప్రారంభించారు.

ఎన్నో ఏళ్లుగా బాల్‌రాజ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ప్రభుత్వానికి విన్నవించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గ్రామస్థులకు ఇచ్చిన హామీ మేరకు బస్సు సౌకర్యం ఏర్పాటుకు కృషి చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు కోరికంటి మల్లయ్య, తోట శంకరయ్య, కొట్టె సంజీవ్, కొల్లూరి రాములు, కొల్లూరి స్వామి, పలువురు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

కమాన్‌పూర్, మార్చి 18: మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈదులూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, ఇల్లందుల మల్లేశంగౌడ్, శైలేంద్ర రాజన్న, జిన్నా రమ, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక, శ్రీవలి తదితరులు ఉన్నారు.